సాక్షి

శ్రీసత్యసాయి జిల్లా

ఆదివారం । 7 । సెప్టెంబర్ । 2025



చీనీ టన్ను రూ.16,500

అనంతపురం మార్కెట్‌యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.16,500 పలికాయి.



టమాట కిలో రూ.16

అనంతపురం కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.16 పలికింది. కనిష్టం రూ.8, సరాసరి రూ.12 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం

35.4°/21.2°

జిల్లా పరిధిలో శనివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. పశ్చిమ దిశగా గంటకు 8 నుంచి 14 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

అరాచకాలతో ఆందోళన

అధికార అండతో రెచ్చిపోతున్నారు. అరాచకాలు సృష్టిస్తున్నారు. దౌర్జన్యాలకు దిగుతున్నారు. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి 'పచ్చ' నేతల ఆగడాలు అన్నీ ఇన్నీ కావు. ప్రతిపక్ష నాయకులపై దాడులకు దిగడమే కాకుండా బాధితులపైనే అక్రమ కేసులు పెడుతూ వేధిస్తున్న 'తమ్ముళ్లు'.. పేదలకు ఉపాధి కల్పించే పరిశ్రమలపైనా పడుతుండడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ఇటీవల 'కియా'లోకి దూసుకెళ్లి బీభత్సం సృష్టించడం కలకలం సృష్టించింది.





ఇటీవల కియా సమీపంలో సంఘు హైటెక్ పరిశ్రమలోకి దౌర్జన్యంగా దూసుకుని వెళ్లిన టీడీపీ నాయకులు(ఫైల్)

'కియా'కు కూటమి కష్టాలు

- నాలుగు నెలల్లోనే రెండుసార్లు టీడీపీ కార్యకర్తల దౌర్జన్యం
- అన్ని కాంట్రాక్టులూ తమకే కావాలని యాజమాన్యంపై ఒత్తిడి
- ఇప్పటికే 900 కార్ల ఇంజిన్ల చోరీతో యాజమాన్యంలో భయం
- కియాలో ఉన్నతోద్యోగాలన్నీ ఇతర రాష్ట్రాల వారికేనన్న విమర్శలు
- నైపుణ్యం లేదన్న సాకుతో స్థానికులకు చిన్న ఉద్యోగాలు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ప్రముఖ 'కియా' కార్ల కంపెనీ కూటమి నేతలతో కష్టాలు ఎదుర్కొంటోంది. తామే రాష్ట్రానికి 'కియా' తెచ్చామని జబ్బలు చరచుకునే సీఎం చంద్రబాబు... ఆయన పార్టీకి చెందిన వారే కంపెనీపై దౌర్జన్యాలకు దిగుతుంటే కిమ్మనడం లేదు. స్థానిక టీడీపీ నేతల ఒత్తిళ్లు, దౌర్జన్యాలతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని కంపెనీ నిర్వాహకులు, ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు.

ఉత్పత్తికి ఆటంకం..

పెనుకొండ నియోజకవర్గం అమ్మవారిపల్లె వద్ద ఉన్న కియా ప్లాంటుపై రెండు దఫాలు టీడీపీ నేతలు దౌర్జన్యానికి దిగారు. కియాలో ఉన్న కాంట్రాక్టులన్నీ తమకే కావాలని, ఎవరికీ ఇవ్వకూడదని కంపెనీలోకి చొరబడ్డారు. కియాకు విడిభాగాలు సరఫరా చేసే చిన్న పరిశ్రమల వాహనాలు ఆపేశారు. పోలీసులు వచ్చి టీడీపీ కార్యకర్తలను వెనక్కి పంపారు. ఇటీవల మళ్లీ టీడీపీ వర్గీయులు ఆందోళనకు దిగడం గమనార్హం. వీళ్లందరూ మంత్రి సవిత అనుచరులని తెలుస్తోంది. ఈ క్రమంలో ఒక్కసారిగా కియా నిర్వాహకుల్లో ఆందోళన మొదలైంది. కార్ల ఉత్పత్తికి ఆటంకం కలుగుతోందని చెబుతున్నారు.

స్థానికులకు ఉద్యోగాలు ఎక్కడ?

కియా యాజమాన్యం స్థానికంగా భూములు ఇచ్చి, తోడ్పాటునందించిన వారికి ఉద్యోగాలు ఇవ్వలేదన్న విమర్శలు ఎదుర్కొంటోంది. ఇక్కడ రమారమి 3 వేల మందికి పైగా పనిచేస్తుంటే స్థానికులు 5 శాతం కూడా లేరు. ఉన్నవారు కూడా రూ.20 వేల కంటే తక్కువ జీతం పొందుతున్న వారేనని తెలుస్తోంది. కొరియన్ దేశస్తుల తర్వాత తమిళనాడు వాళ్లు ఎక్కువగా ఇక్కడ ఉన్నత ఉద్యోగాల్లో ఉన్నారని, స్థానికులకు నైపుణ్యం లేదన్న సాకుతో ఉద్యోగాలు లేవంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.



రోడ్డుపై తమ్ముళ్ల బీభత్సం (ఫైల్)

ఆదాయం అంతంతే..

అనంతపురం లేదా శ్రీ సత్యసాయి జిల్లాలో ఉన్న సిమెంటు లేదా ఇతర పరిశ్రమలతో పోల్చితే కియా నుంచి తగిన ఆదాయం కూడా లేదని జీఎస్టీ అధికారులు చెబుతున్నారు. మన రాష్ట్రానికి కాని, ఉమ్మడి అనంతపురం జిల్లాకు గానీ ఎస్‌జీఎస్‌టీ ద్వారా నామమాత్రంగా కూడా ఆదాయం లేదని, మన రాష్ట్రంలో కార్లు అమ్ముడుపోతేనే ఇక్కడ ఆదాయం ఉంటుందని అంటున్నారు. అయితే, మన రాష్ట్రంలో కియా కార్ల అమ్మకాలు చాలా తక్కువగా ఉన్నట్లు తెలిసింది. ఇతర రాష్ట్రాలకు వెళ్లడంతో రాష్ట్రానికి కియా నుంచి సరైన ఆదాయం రావడం లేదని అభిప్రాయపడుతున్నారు.

900కు పైగా ఇంజిన్లు మాయం...

కొన్ని నెలల క్రితం 'కియా'లో భారీ దొంగతనం జరిగింది. రమారమి 900 కార్ల ఇంజిన్లు మాయమయ్యాయి. ఈ వ్యవహారంలో పోలీసులు కొంతమందిని పట్టుకోగలిగినా రికవరీ 20 శాతం కూడా జరగలేదని తెలిసింది. ఈ ఘటనతో కియాలో ఏం జరుగుతోందో అర్థం కాని పరిస్థితి. ఈ క్రమంలో కంపెనీ ఉద్యోగుల్లో ఆందోళన నెలకొనగా.. రోజుకో ఘటనతో యాజమాన్యం బెంబేలెత్తుతోంది.

వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ విజయశ్రీ



డాక్టర్ విజయశ్రీకి శుభాకాంక్షలు తెలియజేస్తున్న సిబ్బంది

అనంతపురం మెడికల్: అనంతపురం ప్రభుత్వ వైద్య కళాశాల 17వ ప్రిన్సిపాల్‌గా డాక్టర్ విజయశ్రీ శనివారం బాధ్యతలు తీసుకున్నారు. విజయవాడలోని సిద్ధార్థ మెడికల్ కళాశాలలో పెథాలజీ విభాగాధిపతిగా ఉన్న ఆమెను అనంతపురం వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శుల నియామకం

అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శులు(పార్లమెంటు)గా పలువురిని నియమిస్తూ అధిష్టానం ఉత్తర్వులు జారీ చేసింది. వీరికి అసెంబ్లీ నియోజకవర్గ బాధ్యతలు అప్పగించింది. జిల్లాకు చెందిన చౌళూరు మధుమతిరెడ్డికి మడకశిర, పెనుకొండ అసెంబ్లీ స్థానాలు, అనంతపురం జిల్లాకు చెందిన నిట్టూరు రఘునాథ్ రెడ్డికి కదిరి, పుట్టపర్తి అసెంబ్లీ స్థానాలు, నార్పల సత్యనారాయణ రెడ్డికి రాప్తాడు అసెంబ్లీ, కే.రమేష్‌రెడ్డికి ధర్మవరం అసెంబ్లీ, ఫయాజ్ బాషాకు హిందూపురం అసెంబ్లీ స్థానం కేటాయించింది. వీరు ఆయా నియోజకవర్గాల్లో పార్టీ పటిష్టతకు కృషి చేయనున్నారు.

న్యూస్‌రీల్

కిక్కిరిసిన ఖాద్రీశుని ఆలయం



ఖాద్రీశుని దర్శనానికి క్యూలో వెళ్తున్న భక్తులు

కదిరి టౌన్: శ్రీ ఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయం శనివారం భక్తులతో పోటెత్తింది. కదిరి పరిసర ప్రాంతాల నుంచే కాకుండా ఇతర జిల్లాలు, కర్ణాటక నుంచి సైతం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఇన్‌స్పైర్ మనాక్‌పై రేపటి నుంచి అవగాహన

ప్రశాంతి నిలయం: జిల్లాలో 2025–26 విద్యా సంవత్సరానికి గాను ఇన్‌స్పైర్ మనాక్, స్కూల్ ఇన్నోవేషన్ మారథాన్ ఆన్‌లైన్ పోర్టల్‌లో నామినేషన్ల అప్‌లోడ్‌పై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి క్రిష్టప్ప శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పెనుకొండ డివిజన్ ఉపాధ్యాయులకు సోమవారం ఉదయం హిందూపురంలోని చిన్మయా విద్యాలయంలో, పుట్టపర్తి డివిజన్ వారికి సోమవారం మధ్యాహ్నం కొత్తచెరువు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ధర్మవరం డివిజన్ ఉపాధ్యాయులకు మంగళవారం ఉదయం ధర్మవరం బాలుర ఉన్నత పాఠశాలలో, మధ్యాహ్నం కదిరి డివిజన్ ఉపాధ్యాయులకు కదిరి బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రతి ఉన్నత, ప్రాథమికోన్నత, కేజీబీవీ, మోడల్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల నుంచి గణితం, జీవశాస్త్రం, భౌతిక శాస్త్రం బోధించే ఒక్కొక్క ఉపాధ్యాయుడిని పంపించాలని ఆదేశించారు. రిజిస్టర్ చేసుకున్న అన్ని పాఠశాలల నుంచి సెప్టెంబర్ 15లోగా నామినేషన్లు సమర్పించాలని సూచించారు.

ఘనంగా సత్యసాయి మీడియా సెంటర్ వార్షికోత్సవం



చిన్నారుల నృత్య ప్రదర్శన

ప్రశాంతి నిలయం: సత్యసాయి మీడియా సెంటర్ 24వ వార్షికోత్సవం శనివారం ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభా మందిరంలో బాబా మహాసమాధి చెంత ఘనంగా జరిగింది. ఉదయం వేడుకలను సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రాజు ప్రారంభించారు. శ్రీ సత్యసాయి కిడ్ వరల్డ్ చానెల్‌కు చెందిన చిన్నారులు 'గణేష్ మహిమ' పేరుతో అద్భుత నృత్య ప్రదర్శన ఇచ్చారు. సత్యసాయి మీడియా సెంటర్ సాధించిన ఘట్టాలతో కూడిన పుస్తకాన్ని ఆర్‌జే రత్నాకర్‌తో పాటు ట్రస్ట్ సభ్యుడు చక్రవర్తి, మీడియా సెంటర్ డైరెక్టర్ సుందర్ స్వామినాథన్ ఆవిష్కరించారు. సాయంత్రం మీడియా సెంటర్ సభ్యులు ప్రశాంతి వాహిని పేరుతో సంగీత కచేరీ నిర్వహించారు.

'అన్నదాత పోరు'తో ప్రభుత్వానికి కనువిప్పు కలగాలి

- రైతాంగాన్ని ఆదుకోవడంలో సర్కారు విఫలం
- ఎరువులు బ్లాక్ మార్కెట్‌కు తరలిపోతున్నా పట్టించుకోవడం లేదు
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్



అన్నదాత పోరు కార్యక్రమం పోస్టర్లను విడుదల చేస్తున్న జిల్లా అధ్యక్షురాలు, మాజీ మంత్రి ఉషశ్రీచరణ్

రొద్దం(పరిగి)/పెనుకొండ రూరల్: వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఈ నెల తొమ్మిదిన తలపెట్టిన 'అన్నదాత పోరు'కు రైతులు పెద్దసంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంతో ప్రభుత్వానికి కనువిప్పు కలగాలన్నారు. ఈ మేరకు ఆమె శనివారం పార్టీ శ్రేణులతో కలిసి పెనుకొండలోని పార్టీ కార్యాలయంలో, రొద్దం మండలం చిన్నమంతూరులో 'అన్నదాత పోరు' పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ వైఫల్యం వల్ల రైతులకు తీరని అన్యాయం జరుగుతోందన్నారు. కనీసం ఎరువులు సైతం ఇవ్వలేని పరిస్థితి ఉందన్నారు. గతేడాది అతివృష్టి, అనావృష్టి కారణంగా నష్టపోయిన రైతాంగానికి ఇప్పటికీ నయా పైసా ఆర్థికసాయం అందించలేదన్నారు. ఈ ఏడాది కూడా ప్రకృతి కన్నెర్ర చేసినా ప్రభుత్వం ఎలాంటి సహాయక చర్యలూ చేపట్టలేదన్నారు. ఆర్‌ఎస్‌కేల్లో యూరియా స్టాక్ లేదని, డిస్ట్రిబ్యూటర్లే బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నప్పటికీ ప్రభుత్వం వారిపై చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. రైతన్నలకు జరుగుతున్న అన్యాయాన్ని, ఎండగట్టేందుకే 'అన్నదాత పోరు' నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పెనుకొండలో జరిగిన కార్యక్రమంలో సోమందేపల్లి జెడ్పీటీసీ సభ్యుడు అశోక్ కుమార్, పార్టీ మండల కన్వీనర్ గజేంద్ర, ఉప సర్పంచ్ వేణు, బ్రాహ్మణపల్లి సర్పంచ్ జిలాన్ ఖాన్, నాయకులు మంజునాథ్, ఇమామ్ వలి, రఫీక్ సాబ్, జితేంద్ర రెడ్డి, అభిషేక్‌రెడ్డి, ఆదినారాయణ, చిన్నమంతూరులో జరిగిన కార్యక్రమంలో రొద్దం ఎంపీపీ నాగమ్మ, నాయకులు రామచంద్రారెడ్డి, ఎన్.నారాయణరెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, చెరుకూరి సర్పంచ్ సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు దోపిడీ కేసులో నిందితుడి అరెస్టు

- రెండు కిలోల బంగారు ఆభరణాలు, కారు, బైకు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: హిందూపురం రూరల్ తూముకుంట చెక్‌పోస్ట్ సమీపంలోని స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) బ్రాంచులో దోపిడీకి పాల్పడిన అంతరాష్ట్ర ముఠా సభ్యుడు అనిల్ కుమార్ పన్వార్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. అతని నుంచి రెండు కిలోల బంగారు ఆభరణాలు, కారు, బైకు స్వాధీనం చేసుకున్నారు. వివరాలను ఎస్పీ రత్న శనివారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో హిందూపురం డీఎస్పీ కేవీ మహేష్‌తో కలసి మీడియాకు వెల్లడించారు. ఈ ఏడాది జులై 26న తూముకుంట ఎస్‌బీఐలో దొంగతనం జరిగింది. విలువైన ఆభరణాలు, నగదు చోరీకి గురైనట్లు బ్యాంకు సిబ్బంది ఫిర్యాదు చేశారు. ఈ మేరకు హిందూపురం రూరల్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. అనంతపురం రేంజ్ డీఐజీ షిమోషీ ఆదేశాల మేరకు అనంతపురం, చిత్తూరు, తిరుపతి, శ్రీసత్యసాయి జిల్లాలకు చెందిన పోలీసులతో ఎనిమిది ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి.. ఐదు రాష్ట్రాలలో గాలింపు చేపట్టారు. ఈ కేసులో నిందితుడైన హర్యానా రాష్ట్రానికి చెందిన అనిల్ కుమార్ పన్వార్‌ను గుర్గాన్ జిల్లాలో అరెస్ట్ చేశారు. అతని నుంచి రెండు కేజీల బంగారు ఆభరణాలు, కారు, బైకు స్వాధీనం చేసుకున్నారు. చెడు వ్యసనాలకు బానిసైన పన్వార్.. సులభంగా డబ్బు సంపాదించవచ్చనే ఉద్దేశంతో దేశంలో అనేక చోట్ల బ్యాంకు దోపిడీలకు పాల్పడ్డాడు. ఈ కేసుల్లో జైలుకు వెళ్లడం, బయటకు వచ్చిన తర్వాత మళ్లీ దొంగతనాలు చేయడం అలవాటుగా చేసుకున్నాడు. గతంలో అనంతపురంలో జరిగిన బ్యాంకు దోపిడీ కేసులోనూ ముద్దాయిగా ఉన్నాడు. ఇతనిపై వివిధ రాష్ట్రాల్లో 18 కేసులు ఉన్నాయి. ఐదేళ్లు జైలుకు కూడా వెళ్లాడు. కాగా..తూముకుంట బ్యాంకు దోపిడీ కేసులో రాజస్థాన్‌కు చెందిన ఇంకొక ముఠా సభ్యుడు పరారీలో ఉన్నాడని, అతన్ని కూడా త్వరలోనే పట్టుకుంటామని ఎస్పీ తెలిపారు. అంతరాష్ట్ర ముఠా సభ్యుణ్ని పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన పోలీసు అధికారులు, సిబ్బందికి ఎస్పీ ప్రశంసాపత్రాలు అందజేశారు.

కొనసాగుతున్న యూరియా కష్టాలు



బీడుపల్లి ఆర్‌ఎస్‌కే వద్ద యూరియా కోసం వేచివున్న రైతులు



రత్నగిరి ఆర్‌ఎస్‌కే వద్ద రైతుల రద్దీ

పుట్టపర్తి టౌన్: రైతులకు యూరియా కష్టాలు కొనసాగుతున్నాయి. బస్తా యూరియా దొరకడం కూడా గగనంగా మారింది. పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని బీడుపల్లి రైతు సేవా కేంద్రంలో శనివారం యూరియా పంపిణీ చేపట్టారు. ఈ కేంద్రానికి 140 బస్తాల యూరియా మాత్రమే కేటాయించారు. గ్రామంలో రైతుల సంఖ్య 500 పైగా ఉంది. దీంతో రైతులు ఉదయం ఆరు గంటల నుంచి పడిగాపులు కాశారు. ఆర్‌ఎస్‌కే సిబ్బంది ఉదయం 10 గంటలకు పంపిణీ ప్రారంభించారు. రైతుల తాకిడిని దృష్టిలో ఉంచుకుని ఒక్కొక్కరికి బస్తా మాత్రమే అందజేశారు. 135 మంది రైతులు మొదట పేర్లు నమోదు చేసుకోగా..వారికి మాత్రమే పంపిణీ చేశారు. మిగిలిన రైతులు నిరాశతో వెనుదిరిగారు. సర్వర్ నిదానంగా పనిచేయడంతో పంపిణీ మందకొడిగా సాగింది.

రొళ్ల: మండల పరిధిలోని రత్నగిరి రైతు సేవా కేంద్రం వద్ద శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు యూరియా కోసం రైతులు బారులు తీరారు. ఇది వరకే మల్లినమడుగు, దొడ్డేరి రైతు సేవా కేంద్రాలకు 120 బ్యాగుల చొప్పున సరఫరా అయిన యూరియా ప్రస్తుతం ఖాళీ అయింది. దీంతో రత్నగిరిలో పంపిణీ చేస్తారని తెలుసుకున్న రైతులు పెద్ద సంఖ్యలో అక్కడికి తరలివచ్చారు. అక్కడ కూడా 120 బ్యాగుల యూరియా మాత్రమే ఉండగా.. వందల సంఖ్యలో రైతులు రావడంతో పంపిణీ చేసేందుకు ఆర్‌ఎస్‌కే సిబ్బంది ఇబ్బంది పడ్డారు. ప్రభుత్వం బస్తా యూరియా ధర రూ.266.50 చొప్పున నిర్ణయించగా.. ఆర్‌ఎస్‌కే సిబ్బంది రూ.300 వసూలు చేస్తున్నారని రైతులు ఆరోపించారు.

యూరియా పంపిణీలో అక్రమాలు జరిగితే కఠిన చర్యలు

- కలెక్టర్ టీఎస్ చేతన్

ప్రశాంతి నిలయం: యూరియా పంపిణీలో అక్రమాలు జరిగితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ స్పష్టం చేశారు. శనివారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో యూరియా మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యూరియా సరఫరా, నిల్వలలో తేడాలు రాకూడదన్నారు. అక్రమాలకు పాల్పడే వారిపై 6ఏ కేసులు నమోదు చేస్తామన్నారు. యూరియా సరఫరాలో లోటుపాట్లు తలెత్తకుండా ఆర్డీవోలు, వ్యవసాయ అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. రైతులకు సమయానుకూలంగా ఎరువుల పంపిణీ చేపట్టాలని ఆదేశించారు. ఆ రోజుకు ఎంత సరఫరా అవుతుంది, ఎంతమందికి పంపిణీ చేస్తారనే వివరాలు ముందుగానే రైతులకు తెలియజేయాలన్నారు. ఈ–క్రాప్ నమోదు తప్పనిసరిగా చేపట్టాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, వ్యవసాయ శాఖ జిల్లా ఇన్‌చార్జ్ అధికారి రామునాయక్, మార్క్‌ఫెడ్ డీఎం గీతా, డీసీఓ కృష్ణానాయక్, జిల్లా పరిశ్రమల అధికారి నాగరాజు, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి శుభదాస్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్

'ఉపాధి' కూలీల వేతన వెతలు

- మూడు నెలలుగా జమ కాని కూలి డబ్బు
- పనులపై కొరవడిన ఆసక్తి
- రెండు వేలకు మించని హాజరు

సాక్షి, పుట్టపర్తి/ఎన్‌పీకుంట: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనులు చేసిన కూలీలకు వేతనాలు అందడం లేదు. మూడు నెలలుగా జమ కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాకు సంబంధించి సుమారు రూ.77.47 కోట్ల వేతన బకాయిలు రావాల్సి ఉంది. వేతనాలు సకాలంలో రాకపోవడంతో పనులకు వెళ్లేందుకు కూలీలు ఆసక్తి చూపడం లేదు. జిల్లాలో సుమారు 3.83 లక్షల మంది కూలీలు ఉండగా.. వీరిలో 80 వేల మంది దాకా పనుల్లో పాల్గొని, మూడు నెలలుగా వేతనాల కోసం ఎదురుచూస్తున్నారు. చివరగా ఈ ఏడాది మే 28న వేతనం జమ అయ్యింది.

తగ్గిపోయిన హాజరు

సకాలంలో వేతనాలు రాకపోవడంతో 'ఉపాధి' పనులకు కూలీల హాజరు పూర్తిగా తగ్గిపోయింది. నాలుగైదు రోజులుగా జరిగిన పనులను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతోంది. రోజువారీగా జిల్లాలో కనీసం రెండు వేల మంది కూడా పనుల్లో పాల్గొనడం లేదు. ఈ నెల మూడో తేదీన 1,997 మంది మాత్రమే హాజరయ్యారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. అధికారులను అడిగితే నిధులు రాగానే జమ చేస్తామంటున్నారని, ఎప్పుడొస్తాయో చెప్పడం లేదని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విధిలేక చాలామంది కూలీలు బతుకుదెరువు కోసం బెంగళూరు, కేరళ వంటి ప్రాంతాలకు వలసలు వెళుతున్నారు.



ఎన్‌పీకుంట మండలం పడమర నడిమిపల్లి వద్ద పనులు చేస్తున్న కూలీలు

జిల్లాలో...

- జాబ్‌కార్డులు – 2.17 లక్షలు
- మొత్తం కూలీలు – 3.83 లక్షలు
- పనుల్లో పాల్గొన్న కూలీలు – 80 వేలు
- వేతన బకాయిలు – రూ.77.47 కోట్లు

గత ప్రభుత్వంలో ఇబ్బంది లేకుండా..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఉపాధి కూలీలకు ఎప్పటికప్పుడు వేతనాలు జమ అయ్యేవి. కేంద్ర ప్రభుత్వం నుంచి విడుదల కాగానే.. కూలీల బ్యాంకు ఖాతాల్లో జమ చేసేవారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఉపాధి పనులను గాలికొదిలేసింది. పైగా క్షేత్ర స్థాయిలో ఫీల్డ్ అసిస్టెంట్లు చేతివాటం ప్రదర్శిస్తుండటంతో పనులపై ఆసక్తి పోయిందని కూలీలు చెబుతున్నారు.

త్వరలోనే జమ చేస్తాం

ఉపాధి వేతనాలు పెండింగ్ ఉన్న మాట వాస్తవమే. నివేదికలు సమర్పించాం. త్వరలోనే నిధులు విడుదల అవుతాయి. కాగానే కూలీల బ్యాంకు ఖాతాలకు సొమ్ము జమ అవుతుంది. ఎలాంటి ఆందోళనా వద్దు.

– కె.విజయప్రసాద్, డ్వామా పీడీ, శ్రీసత్యసాయి జిల్లా

కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలి?



మూడు నెలలుగా కూలి డబ్బులు పడలేదు. అధికారులను అడిగితే రేపో, మాపో అంటున్నారు. నెలల తరబడి కూలి డబ్బులు చెల్లించకపోతే కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలి? ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వేతనాలు వెంటనే మంజూరు చేయాలి.

– ఆటో కిష్టా, ఎన్‌పీ కుంట

బకాయిలు విడుదల చేయాలి



ఉపాధి పనులకు సంబంధించి వేతనాలు సకాలంలో జమ కావడం లేదు. కుటుంబాన్ని పోషించుకోవడం భారంగా మారింది. సకాలంలో వేతనాలు చెల్లిస్తే పనులు చేయడానికి ఉత్సాహం ఉంటుంది. అధికారులు చొరవ తీసుకొని వేతనాలు విడుదలయ్యేలా చూడాలి.

– టి.ఉత్తన్న, బందారుచెట్లపల్లి, ఎన్‌పీకుంట

క్లుప్తంగా

యూరియా పంపిణీలో ప్రభుత్వం విఫలం


ఈరలక్కప్ప

మడకశిర: రైతులకు అవసరమైన యూరియాను పంపిణీ చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప విమర్శించారు. ఈ మేరకు ఆయన శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. యూరియా కొరతకు ప్రభుత్వ చేతకాని తనమే కారణమని మండిపడ్డారు. కేంద్రం నుంచి డిమాండ్ మేరకు రాష్ట్రానికి యూరియాను తీసుకురావడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు విఫలమయ్యారని విమర్శించారు. యూరియా సమస్యను పరిష్కరించి రైతులను ఆదుకోని చేతకాని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నన్నాళ్లూ రైతులకు ఆర్బీకేలు, పీఏసీఎస్‌ల ద్వారా పూర్తి స్థాయిలో యూరియాను అందించారని గుర్తు చేశారు. ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేసి వ్యవసాయోత్పత్తులకు గిట్టుబాటు ధరలు కల్పించారని తెలిపారు. ఉచిత పంటల బీమా, రైతు భరోసా, సున్నా వడ్డీ రుణాలు సకాలంలో అందించి రైతులను వైఎస్ జగన్ ఆదుకున్నారని పేర్కొన్నారు. ఉచిత పంటల బీమా, ధరల స్థిరీకరణ, సున్నా వడ్డీ పథకాలను రద్దు చేసి రైతులను నిండా ముంచారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వానికి రైతులు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

వైఎస్సార్‌సీపీ నాయకులకు 41ఏ నోటీసులు


వైఎస్సార్‌సీపీ నాయకులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ సత్యనారాయణ

చెన్నేకొత్తపల్లి: రాప్తాడుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు సత్యనారాయణరెడ్డి, రామాంజనేయులు, వెంకటేష్‌కు చెన్నేకొత్తపల్లి పోలీసులు 41ఏ నోటీసులు జారీ చేశారు. వీరు గత నెలలో రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేశారంటూ టీడీపీకి చెందిన ఫణీంద్ర ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ముగ్గురినీ ఎస్‌ఐ సత్యనారాయణ శనివారం స్టేషన్‌కు పిలిపించి, 41ఏ నోటీసులు అందజేశారు.

అన్నదాతలతో చెలగాటం

- ఐఏబీ సమావేశం నిర్వహణలో అంతులేని నిర్లక్ష్యం
- ప్రజాప్రతినిధులకు తీరిక లేక కుదరని ముహూర్తం
- అదును దాటిపోతున్నా ఆయకట్టుకు నీరివ్వలేకపోతున్న వైనం

అన్నదాతలతో కూటమి ప్రభుత్వం చెలగాటమాడుతోంది. బోరుబావుల కింద సాగు చేసుకుంటున్న పంటల అవసరానికి తగ్గట్లు యూరియా అందించకపోవడంతో ఇప్పటికే రైతులు అల్లాడిపోతున్నారు. మరోవైపు రిజర్వాయర్లలో నీరున్నా ఆయకట్టు భూములకు నీరు వదలకుండా నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తుండడంతో రైతన్నలకు దిక్కుతోచడం లేదు.


అనంతపురం వద్ద బోసిపోతున్న తుంగభద్ర ఎగువ కాలువ

జిల్లాలో హెచ్చెల్సీ ఆయకట్టు	1.80 లక్షల ఎకరాలు
ఏటా సాగునీరు అందిస్తున్నది	సగటున లక్ష ఎకరాలకు
ఈ ఏడాది హెచ్చెల్సీకి కేటాయింపులు	24.068 టీఎంసీలు
ఇప్పటి వరకూ జిల్లాకు వచ్చిన నీరు	6.966 టీఎంసీలు
పీఏబీఆర్‌లో నీటి నిల్వ	4.561 టీఎంసీలు
ఎంపీఆర్‌లో నీటి నిల్వ	2.361

అనంతపురం సెంట్రల్: వర్షాలకు తుంగభద్ర, శ్రీశైలం జలాశయాలు పొంగిపొర్లుతున్నాయి. నెలన్నర రోజులుగా గేట్ల ద్వారా దిగువకు నీరెళ్లిపోతోంది. ఈ సమయంలో జిల్లాలో ఆయకట్టుకు ఎలాంటి ఢోకా ఉండదని అందరూ భావించారు. కానీ కూటమి ప్రభుత్వంలో అందుకు పూర్తి భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. కీలకమైన సాగునీటి సలహామండలి సమావేశం ఇప్పటికీ నిర్వహించకపోవడంతో ఆయకట్టు భూములు ఇప్పటికీ బీడుగా దర్శనమిస్తున్నాయి. మంత్రులు, ప్రజాప్రతినిధులకు తీరికలేకపోవడంతో సమావేశానికి ముహూర్తం కుదరడం లేదని తెలిసింది.

గత ప్రభుత్వంలో జూలైలోనే..

సాధారణంగా ఆగస్టులోపే ఐఏబీ సమావేశం నిర్వహించడం ఆనవాయితీ. గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో ఏటా జూలైలోనే సమావేశం నిర్వహించేవారు. ఉపకాలువలకు ఎప్పటి నుంచి నీటిని విడుదల చేస్తారు.. ఎన్ని రోజులు వదులుతారు.. తదితర వివరాలు అధికారికంగా ప్రకటించారు. దీనికి తగ్గట్టుగా రైతులు నార్లు పోసుకొని పంటలు సాగు చేసుకునేందుకు సిద్ధంగా ఉండేవారు. ఈ క్రమంలో పంటల సాగుకు నీటి ఇబ్బందులు ఉత్పన్నం కాకుండా ఉండేవి. కానీ, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో పరిస్థితి పూర్తి భిన్నంగా మారడంతో రైతులకు దిక్కుతోచని పరిస్థితి ఏర్పడింది.

నెలరోజులుగా తిరుగుతున్నా...

ఐఏబీ సమావేశం నిర్వహణ తేదీ ఖరారు కోసం ప్రజాప్రతినిధుల చుట్టూ అధికారులు కాళ్లరిగేలా తిరుగుతున్నా స్పందన లేదని తెలిసింది. బిజీగా ఉన్నామంటూ దాటవేత ధోరణి అవలంబిస్తున్నట్లు సమాచారం. జిల్లాకు చెందిన ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అపాయింట్‌మెంట్ అసలు దొరకడమే లేదని తెలిసింది. ఆయకట్టుకు నీరందిస్తే త్వరితగతిన పంటలు సాగు చేసుకోవడానికి ఆస్కారం ఉంటుంది. ఖరీఫ్ సీజన్ ముగిసి రబీలోకి ప్రవేశిస్తున్నా నీరివ్వకపోవడంతో పంట దిగుబడులపై తీవ్ర ప్రభావం పడే అవకాశముంటుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

త్వరలో సమావేశం తేదీ ఖరారు

ఈ ఏడాది తుంగభద్ర, శ్రీశైలం జలాశయాలు నిండడంతో జిల్లాకు త్వరగా నీరు వస్తోంది. హెచ్చెల్సీతో పాటు హంద్రీ-నీవా ద్వారా వస్తున్న నీటిని పీఏబీఆర్, ఎంపీఆర్‌లలో నిల్వ చేస్తున్నాం. త్వరలో కలెక్టర్, ప్రజాప్రతినిధుల అనుమతి తీసుకొని సాగునీటి సలహా మండలి సమావేశం నిర్వహిస్తాం.

–సుధాకర్‌రావు, ఎస్‌ఈ, హెచ్చెల్సీ

ప్రతీకారంతోనే రౌడీషీటర్ హత్య

- 24 గంటల్లోపు కేసు ఛేదింపు
- ముగ్గురు నిందితుల అరెస్ట్



కేసు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: ధర్మవరం నడిబొడ్డున జరిగిన రౌడీషీటర్ లోకేంద్ర హత్య కేసును పోలీసులు ఛేదించారు. తండ్రిని హత్య చేశాడన్న ప్రతీకారంతోనే బాలకృష్ణారెడ్డి తన సహచరులతో కలిసి ఈ ఘాతుకానికి పాల్పడ్డాడు. 24 గంటల వ్యవధిలోనే ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఎస్పీ రత్న శనివారం పుట్టపర్తిలోని పోలీస్ కార్యాలయంలో మీడియాకు వెల్లడించారు. ఏడాది క్రితం ధర్మవరానికి చెందిన బాలకృష్ణారెడ్డి తండ్రి శ్రీనివాసరెడ్డి బాడుగ విషయంలో రూ.15 తక్కువ ఇచ్చినందుకు అప్పట్లో ఆటోడ్రైవర్‌గా ఉన్న లోకేంద్ర దారుణంగా హత్య చేశాడు. అప్పటి నుంచి ప్రతీకారంతో రగిలిపోతున్న బాలకృష్ణారెడ్డి అదును కోసం వేచి చూస్తున్నాడు. ఈ క్రమంలో ఈ నెల నాలుగో తేదీన ధర్మవరం పట్టణంలోని శ్రీనిధి మార్ట్ ముందు స్నేహితుడితో కలిసి బైక్‌లో కూర్చుని ఉండగా.. బాలకృష్ణారెడ్డి తన సహచరులు సయ్యద్ ఇలియాజ్, అంజనేయులుతో కలిసి కారులో వేగంగా వచ్చి ఢీకొట్టాడు. కిందపడిన లోకేంద్రపై బాలకృష్ణారెడ్డి, ఆంజనేయులు కొడవళ్లతో విచక్షణారహితంగా నరికి చంపి.. కారులో పరారయ్యారు. హతుడి తండ్రి ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. డీఎస్పీ హేమంత్‌కుమార్ పర్యవేక్షణలో ప్రత్యేక దర్యాప్తు బృందం సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా బాలకృష్ణారెడ్డి, సయ్యద్ ఇలియాజ్, ఆంజనేయులును నిందితులుగా గుర్తించి.. శనివారం కొత్తపేట సమీపంలో అరెస్ట్ చేశారు. వారినుంచి రెండు వేటకొడవళ్లు, కారు, మూడు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకొన్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ తెలిపారు. కేసును త్వరితగతిన ఛేదించిన పోలీసులను ఎస్పీ అభినందించారు. సమావేశంలో ధర్మవరం టూటౌన్ సీఐ రెడ్డెప్పతో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పలువురికి డీడీఓలుగా పదోన్నతి

అనంతపురం సిటీ: పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో ఎంపీడీఓలుగా పని చేస్తున్న వారికి ఎట్టకేలకు డీడీఓలుగా పదోన్నతి లభించింది. రాష్ట్ర వ్యాప్తంగా 46 మంది ఎంపీడీఓలను డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్లు(డీడీఓ)గా పదోన్నతి కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్‌కుమార్ శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో తొమ్మిది మందికి ఛాన్స్ లభించింది. డీడీఓలుగా పదోన్నతి కల్పిస్తూ ఇతర ప్రాంతాలకు బదిలీ చేశారు. వైఎస్సార్ కడప జిల్లా దువ్వూరు ఎంపీడీఓగా పని చేస్తున్న సి.రామకృష్ణను శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ డీడీఓగా నియమించారు. ఉమ్మడి జిల్లాలో డీడీఓలుగా పదోన్నతి పొందిన వారి వివరాలు ఇలా..

అధికారి పేరు	పని చేస్తున్న ప్రదేశం	బదిలీ స్థానం
షేక్ షకీలా బేగం	విడపనకల్లు	డీపీఓ, డ్వామా కర్నూలు
మూడే శివానందనాయక్	మడకశిర	డ్వామా ఏపీడీ, హిందూపురం
బి.వెంకటరామిరెడ్డి	గాండ్లపెంట	డ్వామా ఏపీడీ, ఆత్మకూరు, కర్నూలు జిల్లా
వి.సరస్వతి	హిందూపురం	డ్వామా ఏఓ, వైఎస్సార్ జిల్లా
ఎన్.రఘునాథగుప్తా	నల్లచెరువు	డ్వామా ఏఓ, నెల్లూరు జిల్లా
కె.ఆజాద్	అమడగూరు	డ్వామా ఏపీడీ, కమలాపురం, వైఎస్సార్ జిల్లా
బి.రామకృష్ణ	గుమ్మఘట్ట	డ్వామా ఏఓ, అనంతపురం
పి.నరేంద్రకుమార్	గోరంట్ల	డ్వామా ఏపీడీ, డోన్, నంద్యాల జిల్లా
బోయపాటి శకుంతల	అనంతపురం	డ్వామా ఏపీడీ, కదిరి

భూ సమస్యపై యువకుడి నిరసన


తహసీల్దార్ గది వద్ద నిరసన తెలుపుతున్న యువకుడు

చిలమత్తూరు: భూ సమస్య పరిష్కారం కోసం కార్యాలయానికి వస్తే తహసీల్దార్ అందుబాటులో ఉండటం లేదని ఓ యువకుడు శనివారం ధర్నాకు దిగాడు. ఎన్నిసార్లు వచ్చినా ఖాళీ కుర్చీనే కనిపిస్తోందని ఆవేదన వ్యక్తం చేశాడు. హిందూపురంలో పనిచేస్తున్న వెంకటేష్‌కు రెండోసారి చిలమత్తూరుకు ఎఫ్ఏసీ తహసీల్దార్‌గా బాధ్యతలు కేటాయించినా ఏనాడూ విధుల్లో కనిపించడం లేదన్నాడు. ఆర్థిక ఇబ్బందులున్న తాను భూమి విక్రయించుకోవాలనుకుంటే ఆన్‌లైన్‌లో వివరాలు కనిపించడం లేదని, ఈ సమస్యను పరిష్కరించుకుందామని వస్తే అధికారి దొరకడం లేదన్నారు. తహసీల్దార్ వచ్చే వరకూ తాను కార్యాలయం నుంచి వెళ్లబోనని కొంతసేపు భీష్మించాడు. ఎంతకూ ఆయన రాకపోవడంతో వెనుదిరగాల్సి వచ్చింది.

అనుమానాస్పద మృతి

హిందూపురం: పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలోని ట్రాక్ వద్ద రహంతుల్లా (45) అనే పానీపూరి వ్యాపారి శనివారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. భార్య సహారాబాను ఫిర్యాదు మేరకు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

భర్త చేతిలో భార్య హతం

- అనుమానంతోనే ఘాతుకం


హత్యకు గురైన మెహతాజ్

గాండ్లపెంట: భర్త చేతిలో భార్య హత్యకు గురైంది. అనుమానంతోనే ఈ ఘాతుకానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. తూపల్లికి చెందిన కుటాగుళ్ల మన్సూర్ కదిరిలోని ఓ చికెన్ సెంటర్‌లో పని చేస్తున్నాడు. భార్య కుటాగుళ్ల మెహతాజ్ (28) శుక్రవారం ఇంట్లో చెప్పకుండా మదనపల్లికి వెళ్లింది. భార్య ప్రవర్తనపై భర్తకు అనుమానం వచ్చింది. తనకు చెప్పకుండా ఎందుకు ఊరికి వెళ్లావంటూ అదే రోజు రాత్రి భార్యతో మన్సూర్ గొడవపడ్డాడు. ఈ క్రమంలో రోకలిబండ తీసుకుని భార్య తలపై బలంగా కొట్టాడు. దీంతో మెహతాజ్ అక్కడికక్కడే మృతి చెందింది. ఇదంతా పన్నెండేళ్ల కుమారుడి ఎదుటే జరిగింది. శనివారం కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు కదిరి రూరల్ సీఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు.

నాణ్యమైన వైద్య సేవలందించండి

- మందులు, రక్తం అందుబాటులో ఉంచండి
- ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో కలెక్టర్ చేతన్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్

హిందూపురం: రోగులకు నాణ్యమైన వైద్య సేవలందించాలని కలెక్టర్ చేతన్ ఆదేశించారు. శనివారం హిందూపురంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో కలెక్టర్ అధ్యక్షతన ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆస్పత్రిలో ప్రతి విభాగాన్నీ దశలవారీగా అభివృద్ధి చేస్తామన్నారు. రోగులకు తక్షణ, మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వైద్యులు అన్ని వేళల్లోనూ అందుబాటులో ఉండాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించే సిబ్బందిని తొలగించి.. కొత్తవారిని నియమించాలని అధికారులను ఆదేశించారు. డేటా ఎంట్రీ ఆపరేటర్ అవసరాన్ని బట్టి కొత్త నియామకాలు చేపట్టాలని సూచించారు. ఆస్పత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, పార్కింగ్ సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. పార్కింగ్ వద్ద కూడా డిస్‌ప్లే బోర్డులు, రోగులకు ఆస్పత్రిలో లభించే సదుపాయాల సమాచార బోర్డులు అందరికీ అర్థం అయ్యేలా ఉంచాలని చెప్పారు. బ్లడ్ బ్యాంక్‌లో రక్తం అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. రోగులకు అవసరమైన అన్ని మందులూ ఉండేలా చూసుకోవాలన్నారు. ఓపీ కేంద్రాల వద్ద వీడియో డిస్‌ప్లే బోర్డులు, షెడ్లు ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్యంగా ఎలక్ట్రిక్ పనులు సక్రమంగా పర్యవేక్షిస్తూ ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆర్ఓ ప్లాంట్ ఏర్పాటుకు వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు.

ఓపీ చీటీల విభాగం ప్రారంభం

ఆస్పత్రి ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన ఓపీ చీటీల విభాగాన్ని కలెక్టర్ ప్రారంభించారు. హిందూపురం ఆస్పత్రిలో రోగుల రద్దీ అధికంగా ఉంటుందని, ముఖ్యంగా సీజనల్ వ్యాధుల సమయంలో రోగుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. డిసెంబర్ నాటికి ఆస్పత్రిలో అన్ని సదుపాయాలూ పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకుని, డాక్టర్లు, సిబ్బంది కొరతను తక్షణమే పరిష్కరించి రోగులకు మెరుగైన సేవలందేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ ఫైరోజాబేగం, డీసీహెచ్ఎస్ మధుసూదన్, సూపరింటెండెంట్ సి.అన్నపూర్ణ, ఎన్టీఆర్ వైద్యసేవ అధికారి శ్రీదేవి, డాక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

స్టేడియం పనులు వేగవంతం

హిందూపురంలోని మహాత్మా గాంధీ మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్‌లో అసంపూర్తిగా ఉన్న ఇండోర్ షటిల్ స్టేడియం నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. త్వరలో ప్రత్యేక నిధులతో స్టేడియం పనులను వేగవంతం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు విద్యాసాగర్, బాలాజీ, అన్నపూర్ణ, శ్రీనివాస్ నాయుడు, శ్రీదేవి, ప్రభుకుమార్, మధుసూదన్, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల ఆత్మగౌరవం దెబ్బతీయొద్దు


ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

బత్తలపల్లి: వలంటీర్ చేసే పనులు చేయిస్తూ తమ ఆత్మగౌరవం దెబ్బతీస్తున్నారని సచివాలయ ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం ఆంధ్రప్రదేశ్ గ్రామ/ వార్డు సచివాలయ ఉద్యోగుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సచివాలయ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి బత్తలపల్లిలో మండల పరిషత్ కార్యాలయానికి చేరుకుని ఎంపీడీఓ నరసింహనాయుడుకు వినతిపత్రం అందజేశారు. తమకు కేటాయిస్తున్న వలంటీర్ విధులను బహిష్కరిస్తున్నామన్నారు. సర్వేల పేరుతో ఇంటింటికీ తిప్పుతూ ఆత్మగౌరవం దెబ్బతీసేలా చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మండలంలోని 11 గ్రామ సచివాలయాల ఉద్యోగులు పాల్గొన్నారు.

పుట్టపర్తి టౌన్: ప్రభుత్వం సచివాలయం ఉద్యోగులను హీనంగా చూడటం బాధాకరమని మున్సిపాలిటీ సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సరేంద్రరెడ్డి పేర్కొన్నారు. వలంటీర్ల విధులను ఉద్యోగులతో చేయించడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు మోహన్, నరసింహ, లావణ్య, కవిత, రామకృష్ణ, రఫీ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

9న ఎకాలజీలో 'ఫార్మా' అడ్మిషన్ మేళా

అనంతపురం అగ్రికల్చర్: ఫార్మా రంగంలో శిక్షణ, ఉద్యోగాలకు సంబంధించి ఈ నెల 9న అనంతపురం ఏఎఫ్ ఎకాలజీ సెంటర్‌లో అడ్మిషన్, ఉద్యోగ మేళా ఏర్పాటు చేసినట్లు ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ వైవీ మల్లారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో ఎంపికైన యువతీ యువకులకు స్వర్ణభారత్ ట్రస్ట్, విజయవాడలో మూడు నెలల పాటు ఉచిత శిక్షణ, వసతి సదుపాయం ఉంటుందన్నారు. 2023, 2024, 2025లో బీఎస్సీ లేదా ఎంఎస్సీ (బీజెడ్‌సీ) కెమిస్ట్రీ, డిప్లొమా ఇన్ మెకానికల్ ఎలక్ట్రానిక్స్, కెమికల్ ఇంజినీరింగ్, బీ-ఫార్మా లేదా డీ ఫార్మా లేదా ఎం ఫార్మా, బీఎస్సీ లేదా ఎంఎస్సీ (మైక్రోబయాలజీ), బీఈ లేదా బీటెక్ (కెమికల్ ఇంజినీరింగ్) అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 9న బయోడేటాతో మేళాకు హాజరు కావాలని కోరారు. మరిన్ని వివరాలకు స్థానిక ఆర్డీటీ స్టేడియం ఎదురుగా ఉన్న ఎకాలజీ కార్యాలయం లేదా 81217 17846 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం


మారుతి (ఫైల్)

పెనుకొండ రూరల్: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. కియా ఏరియా స్టేషన్ పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. మునిమడుగు పంచాయతీ చిన్నపరెడ్డిపల్లికి చెందిన మారుతి (28) అమ్మవారిపల్లికి చెందిన రామాంజి అనే యువకుడితో కలిసి వ్యక్తిగత పనుల నిమిత్తం శుక్రవారం ద్విచక్రవాహనంపై రాంపురం వెళ్లారు. అక్కడ పని చూసుకుని తిరుగుపయనమయ్యారు. రాత్రి 11 గంటల సమయంలో పెనుకొండలోని 44వ జాతీయ రహదారిపై కొత్తచెరువు రోడ్డు మలుపు వద్ద రోడ్డు దాటే సమయంలో బెంగళూరు నుంచి తాడిపత్రికి వెళ్తున్న ఫార్చునర్ కారు వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో మారుతి అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన రామాంజిని 108 వాహనం ద్వారా హుటాహుటిన పెనుకొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సూచన మేరకు బెంగళూరుకు తీసుకెళ్లారు. మారుతి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు కియా స్టేషన్ ఎస్ఐ రాజేష్ తెలిపారు.

అంజినప్పకు 'బళ్లారి రాఘవ' పురస్కారం


అవార్డుతో పాటు సత్కారం అందుకుంటున్న అంజినప్ప

బత్తలపల్లి: తేనె తెలుగు కల్చరల్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు, కళాభిషేకం నిర్వాహకులైన శేషయ్యగారిపల్లి అంజినప్ప ప్రతిష్ఠాత్మక బళ్లారి రాఘవ జాతీయ పురస్కారం అందుకున్నారు. శనివారం బళ్లారి కల్చరల్ యాక్టివిటీస్ అసోసియేషన్ వారు బళ్లారిలోని బీపీఎస్‌సీ కళాశాల శరవణ ఆడిటోరియంలో అవార్డుల ప్రదానోత్సవం నిర్వహించారు. కళాప్రపూర్ణ బళ్లారి రాఘవ జాతీయ పురస్కారాన్ని బళ్లారి రాఘవ మనవడైన రఘురామ్, అనంతపురం డిప్యూటీ కలెక్టర్ రఘునాథ్ చేతుల మీదుగా అంజినప్ప అందుకున్నారు. అవార్డుతో పాటు శాలువా కప్పి పూలమాలతో ఘనంగా సత్కారం అందుకున్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు శీలా బ్రహ్మయ్య, ప్రధాన కార్యదర్శి యశ్వంత్‌రాజ్, కోశాధికారి మల్లేసు, కార్యవర్గ సభ్యులు తదితరులు అంజినప్ప కళాసేవలను కొనియాడారు.

బంగారు గొలుసు అపహరణ

ధర్మవరం రూరల్: ఆరుబయట పడుకున్న మహిళ మెడలోని బంగారు గొలుసును దుండగులు అపహరించుకుపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు వివరాలిలా ఉన్నాయి. నిమ్మలకుంట గ్రామంలో లలితమ్మ తన భర్త కుళ్లాయప్పతో కలిసి ఇంటి ఆవరణలో మంచంపై నిద్రిస్తోంది. శనివారం తెల్లవారుజామున ఇద్దరు దుండగులు వచ్చి లలితమ్మ మెడలో ఉన్న రెండు తులాల బంగారు గొలుసు (మంగళసూత్రం) లాక్కెళ్లారు. బాధితురాలు లేచి గట్టిగా అరిచేలోపు దుండగులు చీకట్లో కనిపించకుండా పారిపోయారు.